నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 హైదరాబాద్, ఆదివారం 17 మార్చి 2024 SANGAREDDY


సంగారెడ్డి జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు


మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు


సిద్దిపేట జిల్లా దుబ్బాకలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# భగ్గుమన్న బీఆర్ఎస్

## ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహజ్వాల

- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నిరసనల వెల్లువ
- పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు
- మోదీకి వ్యతిరేకంగా మిన్నంటిన నినాదాలు
- పలుచోట్ల ప్రధానమంత్రి దిష్టిబొమ్మల దహనం
- కాంగ్రెస్, బీజేపీలపై మండిపడిన బీఆర్ఎస్ నేతలు
- నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు

సిద్దిపేట/మెదక్/సంగారెడ్డి, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి రోడ్లపై బైఠాయించారు. కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నల్లజెండాలు పట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. పలు చోట్ల ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మలను దహ నం చేశారు. ఈడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం, దోపిడి రాజ్యం అంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ జిల్లాలో జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లాలో జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే చింతాప్రభాకర్ నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గజ్వేల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేటలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వేలేటి రాధాకృష్ణశర్మ, సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ కడవెర్గు రాజనర్సు, హుస్నాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, నర్సాపూర్‌లో స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, నారాయణ్‌ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జహీరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావు నేతృత్వంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాలకు చెందిన వారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కవిత అరెస్టు అప్రజాస్వామికం, అక్రమం, అనైతికం అంటూ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కుట్రపూరితంగా ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని వారు విమర్శించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఒకరోజు ముందే కావాలని మాజీ సీఎం కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని కవితను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు, ఎన్ని అరెస్టులు చేసినా ఎంత మంది ఈడీలు, మోడీలు వచ్చినా భయపడేది లేదని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయాలని ఉమ్మడి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు.


సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, పార్టీ శ్రేణులు


సిద్దిపేట జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు


జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, బీఆర్ఎస్ నాయకులు


సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు జాతీయ రహదారిపై బైఠాయించిన బీఆర్ఎస్ నేతలు


సిద్దిపేట జిల్లా తొగుటలో నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు


సిద్దిపేట జిల్లా చేర్యాలలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు


నారాయణఖేడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

# మోగిన ఎన్నికల నగరా

- ఏప్రిల్ 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్
- ఏప్రిల్ 25 వరకు నామినేషన్లకు తుదిగడువు
- మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు
- తక్షణమే అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
- ఉమ్మడి మెదక్ జిల్లాలో మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలు



సిద్దిపేట, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల నగరా మోగింది. 18వ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ శనివారం విడుదల చేశారు. దేశం లో ఏడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నా రు. తెలంగాణలో ఒకే సారి అన్ని స్థానాలకు నాలుగో దశలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 18ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుండగా ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఇచ్చింది. నాలుగో విడతలో మే 13న పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న కౌంటింగ్ చేపడుతారు. షెడ్యూల్ వెలువడిన రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

### మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలు

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. మెదక్ నుంచి కొత్త ప్రభాకర్‌రెడ్డి, జహీరాబాద్ నుంచి బీబీపాటిల్ గత సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో దుబ్బాక నుం చి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపొందడంతో తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఇటీవల బీజేపీలో చేరారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాలతో మెదక్ పార్లమెంట్ స్థానం విస్తరించి ఉంది. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం సంగారెడ్డి జిల్లాలోని అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, భాన్సువాడ నియోజకవర్గాలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలు, భువనగిరి పార్లమెంట్ పరిధిలో జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు విస్తరించి ఉన్నాయి.

### అన్ని రాజకీయ పార్టీలు సిద్ధం

లోక్‌సభ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో గత శాసనసభ ఎన్నికల్లో అత్యధిక శాసనసభ స్థానాలను గెలిచి బీఆర్ఎస్ తన సత్తా చాటుకుంది. రెండు పార్లమెంట్ స్థానాలను గెలుచుకొని సత్తా చాటాలని బీఆర్ఎస్ పట్టుదలతో ఉంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించి అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయ సేకరణ చేసింది. జహీరాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్, జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్‌షెట్కార్, బీజేపీ నుంచి బీబీ పాటిల్, మెదక్ నుంచి రఘునందన్‌రావును ప్రకటించారు.


సంగారెడ్డిలో నల్లజెండాలతో నిరసన వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్, బీఆర్ఎస్ నేతలు


సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

# చిరుత కలకలం

- మెదక్ జిల్లా డి.ధర్మారం గ్రామ శివారులో సంచరిస్తున్నట్లు అనుమానం
- తొనిగండ్ల అటవీ ప్రాంతంలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- ఆందోళనలో అన్నదాతలు

రామాయంపేట, మార్చి 16: మెదక్ జిల్లా రామాయంపేట మండలం డి.ధర్మారం శివారులోని మెట్టుగోడల ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజామున రైతు గొల్ల దేవరాజు పొలం వద్దకు వెళ్లి ఇంటికి వస్తుండగా పొదలమాటున ఉన్న చిరుత ఒక్కసారిగా పరుగెత్తుకుంటూ వెళ్లిందని తెలిపాడు. నెలరోజుల క్రితం కూడా ఇదే ప్రాంతంలో చిరుత సంచరించిందని, వ్యవసాయ పొలాల వద్ద లేక డి.ధర్మారం అటవీ ప్రాంతంలోనైనా బోన్లు ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులకు రైతులు విజ్ఞప్తి చేశారు. చిరుత వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళనలో ఉన్నామని తెలిపారు. అధికారులు చర్యలు చేపట్టి గ్రామస్తులు, రైతులను కాపాడాలన్నారు. మండలంలోని తొనిగండ్ల అటవీప్రాంతంలో అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



రామయంపేట మండలం తొనిగండ్ల అటవీ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఇన్‌సెట్‌లో) డి.ధర్మారం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత (ఫైల్)


సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలో 4ఎల్ డిస్ట్రిబ్యూషన్ ఉప కాల్వ ద్వారా సాగునీరు విడుదల సందర్భంగా గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# ఫలించిన ఎమ్మెల్యే కృషి

- నీటిని విడుదల చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- మల్లన్నసాగర్ ఉపకాల్వల ద్వారా దుబ్బాకకు సాగునీరు
- సంతోషం వ్యక్తం చేసిన రైతులు

దుబ్బాక, మార్చి16: సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కృషి ఫలించింది. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని బల్వంతాపూర్-మల్లాయిపల్లి శివారులో 4 ఎల్ డిస్ట్రిబ్యూషన్ ఉపకాల్వల నుంచి ఆయన సాగునీరు విడుదల చేశారు. ఉపకాల్వల ద్వారాఎనిమిది గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్డ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో రైతులకు సాగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. మల్లన్నసాగర్ ప్రధాన కాల్వ నుంచి దుబ్బాక నియోజకవర్గంలోని 4ఎల్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా 15 కిలోమీటర్ల పొడవు ఉపకాల్వ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రొట్టే రాజమౌళి, సోలిపేట సతీశ్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భూంరెడ్డి, కొత్త కిషన్‌రెడ్డి, బనాల శ్రీనివాస్, మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.